సాక్షి
అనంతపురం
ఆదివారం । 17 । నవంబర్ । 2024





**కిలో టమాట రూ.23**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.13 ప్రకారం ధర పలికింది.



**పని రాక.. చేయలేక!**

జిల్లా రెవెన్యూ శాఖలో విచిత్ర పరిస్థితి కనిపిస్తోంది. మండలాల్లోని ఉద్యోగులు ఇతరులతో ఫైళ్లు సిద్ధం చేయిస్తున్నట్లు తెలిసింది.

8లో

గరిష్టం/కనిష్టం
32.5°/21.1°

జిల్లా అంతటా శనివారం తుపాను వాతావరణం నెలకొంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై చాలా మండలాల్లో మోస్తరు వర్షపాతం కురిసింది.

# పడిపోయిన ఆదాయం

గత కొన్ని నెలలుగా ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన సొమ్ము పూర్తిగా తగ్గింది. కూటమి సర్కారు పగ్గాలు చేపట్టిన నాటినుంచి నెల నెలకూ పన్నుల వసూళ్లు పడిపోతుండటమే కానీ పెరిగింది లేదు. అన్ని రంగాల్లోనూ వ్యాపారాలు కుప్పకూలినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గతంలో ఎప్పుడూ లేనంతగా జీఎస్టీ వసూళ్లు పడిపోయినట్టు తెలిసింది. గతంతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరంలో 50 శాతం కూడా వసూళ్లు కాలేదనే విషయం స్పష్టమైంది.

**జీఎస్టీ ధమాల్**

- 40 శాతం పైగా పడిపోయిన పన్నుల వసూళ్లు
- ఆటోమొబైల్ రంగం కుదేలు
- అదేబాటలో రియల్ ఎస్టేట్ రంగమూ..
- ఎంఎస్ఎంఈలు భారీగా తగ్గినట్టు వెల్లడి
- కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి కనిపించని సానుకూల పరిస్థితులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు ఆటోమొబైల్ రంగమే. కానీ ఈ ఆర్థిక సంవత్సరంలో ద్విచక్ర వాహనాల అమ్మకాలు 40 శాతం తగ్గినట్టు తేలింది. ఇక కార్ల విషయానికి వస్తే గతంలో ఏడాదిలో వెయ్యి కార్ల వరకూ అమ్ముడయ్యేవి. ఇప్పుడా సంఖ్య 400కు పడిపోయినట్టు పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారు. పెనుకొండ సమీపంలో ఏర్పాటైన కియా నుంచి పన్నుల రూపంలో పెద్దగా ఆదాయం రావడం లేదు. వంద కార్లలో ఇక్కడ 2 మాత్రమే విక్రయాలు జరుగుతున్నాయి. మిగతా 98 ఇతర రాష్ట్రాల్లో అమ్ముడుబోతుండటంతో ఆదాయం నామమాత్రంగానే ఉంది.

**స్థిరాస్థి వ్యాపారం కుదేలు..**

గతంలో భూముల లావాదేవీల కారణంగా సేల్ ట్యాక్స్ రూపంలో (అమ్మకం పన్ను) ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్లాట్లు, ఫ్లాట్లు, వెంచర్లలో కొనుగోళ్లు, భూముల లావాదేవీలు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ ప్రభుత్వం వచ్చాక భూముల కొనుగోళ్లు, విక్రయాలు చేయాలంటే వినియోగదారులు భయపడుతున్నారు.

**పడిపోయిన ఆదాయం..**

సిమెంటు ఇండస్ట్రీ విషయంలో ఒక కంపెనీ నుంచి మాత్రమే అమ్మకం పన్ను బాగా వస్తున్నట్టు తేలింది. రెండు, మూడు ఫ్యాక్టరీలు సిక్‌లో ఉండటం, సరిగా ఉత్పత్తులు రాకపోవడం వంటి కారణాలతో భారీగా ఆదాయం పడిపోయింది.

**ఏర్పాటు కాని ఎంఎస్ఎంఈలు..**

శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలో గతంలో మాదిరిగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నేడు ఏర్పాటు కావడం లేదు. చిన్న పరిశ్రమల స్థాపనతో ఉద్యోగాల కల్పనతో పాటు ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయంలో ప్రభుత్వానికి కొంత ఆదాయం సమకూరుతుంది. కానీ అలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆదాయమూ తగ్గిపోయింది.

**జిల్లాలో మొత్తం జీరో దందానే..!**

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 70 శాతం పన్నులు రాకపోవడానికి జీరో బిజినెస్ కారణమని అధికార వర్గాలు చెబుతున్నాయి. జీరో బిజినెస్ అడ్డాగా అనంతపురం నగరంలోని కమలానగర్ ప్రాంతాన్ని చెప్పుకుంటున్నారు. స్టీలు, పింగాణీ, కిరాణా, బట్టలు, హోటళ్లు ఇలా వేలాది షాపుల నుంచి ఒక్క పైసా రాబడి లేదని తేలింది. దీంతో ఏం చేయాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు.

| | |
|---|---|
| నెలకు కనిష్ట వసూళ్లు | రూ.620 కోట్లు |
| ఏడాదికి వచ్చే రాబడి | రూ.8,000 కోట్లు పైనే |
| ప్రస్తుతం వస్తున్న సొమ్ము (నెలకు) | రూ.350-400 కోట్లు |
| గతంలో పోల్చితే తగ్గిన వసూళ్లు | రూ.150-200 కోట్లు (నెలకు) |

**జీరో బిజినెస్ అరికట్టేందుకు చర్యలు**

జీఎస్టీ రూపేణా పన్నులు చెల్లించని వాళ్లు చాలామంది ఉన్నారు. ఇదంతా జీరో బిజినెస్ కింద లెక్క. దీన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అంతేగాకుండా కొన్ని రంగాల్లో దూకుడు లేదు. దీంతో ఈ ఏడాది పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో రాలేదు.
– శేషాద్రి, జాయింట్ కమిషనర్, జీఎస్టీ

## న్యూస్‌రీల్

### చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి శ్రీహరి

పామిడి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆరవ అదనపు జిల్లా జడ్జి ఎం. శ్రీహరి అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 'మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు' నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడీజేతో పాటు గుత్తి సీనియర్ సివిల్ జడ్జి ఎం. కేశవనాథ ఆచారి, ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు ఎస్కే రొకియా బేగమ్ హాజరై మాట్లాడారు. మహిళలపై రోజురోజుకూ అరాచకాలు, దాడులు అధికమవుతున్నాయన్నారు.అకృత్యాలు అరికట్టాలంటే మహిళలు తప్పకుండా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస చట్టం, అదనపు కట్న వేధింపులు తదితర మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే. తేజోత్స్న, సీడీపీఓ డిల్లీశ్వరి, అడ్వకేట్ రిసోర్స్ పర్సన్లు వీసీ గంగాధర్‌కుమార్, ఏ సూర్యనారాయణ, కోర్టు టైపిస్ట్ సాదిక్‌వలి, పారా లీగల్ వలంటీర్ ఇస్మాయిల్, అంగన్‌వాడీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### స్కిల్ డిజైర్ కంపెనీతో జేఎన్‌టీయూ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ), స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మాదాపూర్ (తెలంగాణ) మధ్య శనివారం అవగాహన ఒప్పందం కుదిరింది. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహించనున్నారు. స్కిల్ డిజైర్ కంపెనీ రూపొందించిన ప్రోగ్రామ్‌లు బీటెక్‌లోని అన్ని బ్రాంచులతో పాటు ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఉపయోగపడతాయని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, డీఏపీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, స్కిల్‌డిజైర్ టెక్నాలజీస్ డైరెక్టర్ శ్రీకాంత్ ముప్పాల తదితరులు పాల్గొన్నారు.

### అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేయాలి



పాల్తూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

విడపనకల్లు: అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. మండల పరిధిలోని పాల్తూరు పోలీసు స్టేషన్‌ను ఎస్పీ జగదీష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో శాంతిభద్రతలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక మద్యం అక్రమ రవాణా కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాల్య వివాహాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు సమస్యలపై పోలీసు స్టేషన్‌కు వస్తే మర్యాదగా నడుచుకోవాలన్నారు. గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, సీఐ చిన్న గౌసు ఉన్నారు.

### కౌలు రైతులకు రుణాలు



మాట్లాడుతున్న డీఏఓ ఉమా మహేశ్వరమ్మ

శింగనమల/గార్లదిన్నె: కౌలు రైతులకు బ్యాంకుల నుంచి పంట రుణాలు అందిస్తామని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ, లీడ్ బ్యాంక్ మేనేజర్ నరసింహారావు తెలిపారు. శనివారం శింగనమల రైతు సేవా కేంద్రంలో, గార్లదిన్నె మండల కేంద్రంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. కౌలు పత్రాలు పొందిన వారికి రూ.1.60 లక్ష వరకు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా పంట రుణం అందిస్తామన్నారు. సాగు చేసిన పంటను వారి పేరుతో నమోదు చేస్తామన్నారు. పంట కాలం పూర్తయిన తర్వాత బ్యాంకుకు చెల్లించాలన్నారు. సకాలంలో అప్పు చెల్లిస్తే మళ్లీ 11 నెలల తర్వాత రుణం ఇస్తారన్నారు. ప్రభుత్వ రాయితీ విత్తనంతో పాటు పెట్టుబడి రాయితీ, పంటల బీమాకు అర్హులవుతారన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్‌డీఎం నరసింహారావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన (పీఎంజేజేవై) ప్రీమియం సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా లభిస్తుందన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వయసు గల బ్యాంకు ఖాతాదారుల కుటుంబ సభ్యులకు బీమా సొమ్ము అందిస్తారన్నారు. సమావేశంలో ఏడీఏ రవి, ఏఓలు అన్వేష్ కుమార్, సునీత, సోమశేఖర్, ఉద్యానశాఖ అధికారి రత్న కుమార్, గార్లదిన్నె కెనరాబ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## కనకదాస జయంతికి పకడ్బందీ ఏర్పాట్లు



కనకదాస విగ్రహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్: నగరంలో ఈ నెల 18న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కనకదాస జయంత్యుత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం గుత్తి రోడ్డులోని కనకదాస విగ్రహాన్ని, సభ నిర్వహించే కన్వెన్షన్ హాలును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. విగ్రహం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సభా ప్రాంగణం వద్ద విద్యుత్, నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజినేయులు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, నగర పాలక సంస్థ కమిషనర్ నాగరాజు, విద్యుత్తు శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నిర్దేశిత లక్ష్యాలు పూర్తిచేయాలి**

అనంతపురం అర్బన్: నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి వివిధ అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సచివాలయ ఉద్యోగులు వెళ్లి జియో కో–ఆర్డినేట్స్ అప్‌డేట్ వందశాతం పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు 65.46 శాతం అప్‌డేట్ చేశారని, మిగిలిన 34.54 శాతం మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన వారు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ఎన్‌పీసీఐ లింక్‌కు సంబంధించి బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు 75.69 శాతం ఎన్‌పీసీఐ లింక్ పూర్తయ్యిందని, మిగిలిన 24.31 శాతం మూడు రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు రోజూ ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు.కాన్ఫరెన్స్‌లో డీపీఓ నాగరాజు నాయుడు, డీఎల్‌డీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శింగనమల: బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర, పీడీలు గోపాలు రెడ్డి, లలితమ్మ తెలిపారు. డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగే అండర్–17 బేస్‌బాల్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి మోహన్ పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం కోర్బాలో డిసెంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న అండర్–19 నెట్‌బాల్ పోటీలకు 9వ తరగతి విద్యార్థులు సంధ్య, చరణ్ ఎంపికైనట్లు వెల్లడించారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు నలుగురు..**

డిసెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా గాజువాకలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్ –14 నెట్‌బాల్ పోటీలకు ఏడో తరగతి విద్యార్థులు ధరణిధ్వన్, గౌతమ్ ఎంపికైనట్లు వారు తెలిపారు. డిసెంబర్ 2 నుంచి 4 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్–14 బాస్కెట్ బాల్ పోటీలకు 8వ తరగతి విద్యార్థి రాజు, 9వ తరగతి విద్యార్థి గణేష్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

## మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచండి

చెన్నేకొత్తపల్లి: అక్రమ మద్యం రవాణాపై నిఘా పెంచాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. చెన్నేకొత్తపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల ఎక్సైజ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల మద్యం జిల్లాలోకి రాకుండా నిఘా పెంచాలన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు కాకుండా చూడాలని ఆదేశించారు. ఎంఆర్‌పీకే మద్యం విక్రయాలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని సీఐ ఫరూక్ ఆజంకు సూచించారు.

## పంటల వివరాల సేకరణకు ప్రత్యేక టీంలు

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: నియోజకవర్గంలోని బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మండలాల్లో కాలుష్య కాటుతో దెబ్బతినే పంటల వివరాలు సేకరించేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. 'పచ్చటి పల్లెల్లో కాలుష్య కుంపటి' శీర్షికన ఈ నెల 14న 'సాక్షి' లో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు అగ్రికల్చర్, హార్టికల్చర్, రెవెన్యూ అధికారులతో కూడిన ప్రత్యేక టీంలను రంగంలోకి దించారు. ఈ సందర్భంగా శనివారం ఆర్డీఓ మాట్లాడుతూ బొమ్మనహాళ్ మండలంలో దెబ్బతింటున్న పంటలు, నష్టపోతున్న రైతుల వివరాలను ఇప్పటికే సేకరించామన్నారు. ప్రస్తుతం డీ హీరేహాళ్ మండలంలో ఈ ప్రక్రియ సాగుతుందన్నారు. త్వరలో వివరాలను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. ఆ తర్వాత పరిహారం పెంచే విషయంపై యజమానులతో చర్చిస్తామని స్పష్టం చేశారు.

## కదం తొక్కిన అంగన్‌వాడీలు



ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు



కలెక్టరేట్ ఎదుట డివైడర్‌పై కూర్చున్న దృశ్యం

అనంతపురం అర్బన్: తమ న్యాయమైన సమస్యల సాధనకు అంగన్‌వాడీలు కదం తొక్కారు. శనివారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు శకుంతల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సంఘం జిల్లా కార్యదర్శి రమాదేవి, మునిసిపల్ వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడారు. అంగన్‌వాడీ మినీ సెంటర్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ మినీ వర్కర్లు సేవలు అందిస్తున్నారన్నారు. సెంటర్ల నిర్వహణలో వర్కర్, హెల్పర్ పనులు చేయాల్సి రావడంతో పనిభారం పెరిగిందన్నారు. ఎంత చేసినప్పటికీ సరైన గుర్తింపు, వేతనం అందడం లేదన్నారు. మినీ వర్కర్లకు పదోన్నతి ఇవ్వాలనే జీఓ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. అత్యవసర సందర్భాల్లోనూ సెలవులు ఇవ్వడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులు రేవతి, కాత్యాయిని, విజయలక్ష్మి, జ్యోతిలత, రేష్మా, విజయ, లావణ్య, మేరి, పాతక్క, కవిత, నాగవేణి, సువర్ణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీల డిమాండ్లు ఇవీ**

- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ తక్షణం జీఓ ఇవ్వాలి.
- మినీ వర్కర్లకు వేసవి సెలవులు ఇవ్వాలి. పదోన్నతులు కల్పించాలి.
- మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనం ఇవ్వాలి.
- గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టులకు మినీ వర్కర్లకూ అవకాశం ఇవ్వాలి.
- 42 రోజుల సమ్మె మినిట్స్ కాపీని అమలు చేయాలి.
- సర్వీసులో ఉండి చనిపోయిన వారికి మట్టిఖర్చుల జీఓ అమలు చేయాలి.



## క్లుప్తంగా

### బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

**అనంతపురం:** జనరల్ నర్సింగ్ మిడ్వైఫరీ(జీఎన్ఎం), బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఈమేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీపీ ప్రతాప్ రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జర్మన్ లాంగ్వేజ్‌పై శిక్షణ ఇచ్చిన అనంతరం ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. ఇందుకోసం రూ.75 వేలు కాషన్ డిపాజిట్ చెల్లించడంతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ శిక్షణతోపాటు ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు వీసా ఫీజు, రానుపోను విమాన టిక్కెట్లు చెల్లిస్తామని తెలిపారు. జర్మనీలో సుమారు రూ.2,33 లక్షల నుంచి 3,26,000(2400 యూరోల నుంచి 3500 యూరోల వరకు) వరకు వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 99888 53335 నంబరులో సంప్రదించాలని సూచించారు.

### హోటల్ సిబ్బందిపై దాడి

**పెద్దవడుగూరు :** మిడుతూరు సమీపంలోని ఓ హోటల్ సిబ్బందిపై మరో హోటల్ యజమానులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు..రాత్రి సమయాల్లో సుదూర ప్రాంతాలకు ప్రయాణీలకుతో వెళ్లే బస్సులు భోజనం కోసం ఆపే విషయంలో ఆమోఘ, రవితేజ్ హోటళ్ల నిర్వాహకుల మధ్య కొన్నేళ్లుగా మనస్పర్థలున్నాయి. ఇదే విషయమై శుక్రవారం రాత్రి మిడుతూరు సమీపంలోని అమోఘ హోటల్ సిబ్బందిపై రవితేజ హోటల్ యజమానులు నారాయణస్వామి, రవితేజ దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

### గొర్రెల కాపరిపై ..


గాయపడిన నగేష్

**గార్లదిన్నె:** గొర్రెల మేపు విషయంలో ట్రాక్టర్ నగర్ సిబ్బంది గొర్రెల కాపరిపై దాడి చేశారు. బాధితుడి వివరాల మేరకు..శింగనమల మండలం వెస్ట్ నరసాపురానికి చెందిన గొర్రెల కాపరి నగేష్ ట్రాక్టర్ నగర్ సమీపంలోని దండకొండలో శనివారం గొర్రెలను మేపు కోసం తోలుకెళ్లాడు. నలుగురు ట్రాక్టర్ నగర్ సిబ్బంది అక్కడకు వచ్చి కొండలో గొర్రెలు మేపరాదని వాదనకు దిగడంతోపాటు అతడిపై కట్టెలతో దాడి చేశారు. తలకు గాయం కావడంతో వెంటనే అతడు కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### యువకుడు ఆత్మహత్య


ఇంద్ర (ఫైల్)

**ఆత్మకూరు:** వడ్డుపల్లిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన భగమంతు, ఈశ్వరమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు మీనుగ ఇంద్ర(21) విద్యుత్ కూలీ పనులు చేసేవాడు. ఇతడు ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడేవాడు. చికిత్స తీసుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

# పని రాక.. చేయలేక !

- మండలాల్లో ఇతరులతో ఫైళ్లు సిద్ధం చేయిస్తున్న ఉద్యోగులు
- పని ఒత్తిడిలో కలెక్టరేట్ ఉద్యోగులు
- మూడు తహసీల్దార్ కార్యాలయాలపై తీవ్ర అవినీతి ఆరోపణలు
- రెవెన్యూ శాఖలో విచిత్ర పరిస్థితి



**అనంతపురం అర్బన్:** జిల్లా యంత్రాంగంలో కీలక భూమిక పోషించే రెవెన్యూ శాఖలో విచిత్రమైన వాతావరణం కనిపిస్తోంది. తీవ్ర పనిఒత్తిడితో ఇక్కడ పనిచేయలేక పోతున్నామని కలెక్టరేట్‌లోని కొన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్న పరిస్థితి. ఇక మండలాల్లో కొందరు ద్వితీయశ్రేణి రెవెన్యూ అధికారులు, సిబ్బందికి తీరు మరోలా ఉంది. ఫైళ్లు సిద్ధం చేయడం చేతగాక ఇతరులతో తయారు చేయిస్తున్నట్లు ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. మరోవైపు మూడు తహసీల్దారు కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు తీవ్రస్థాయిలో వస్తున్నాయి. మొత్తం మీద రెవెన్యూలో 'ఇలాగైతే ఎలా' అనే పరిస్థితి నెలకొంది.

**ఇక్కడ పని చేయలేం బాబోయ్..**

కలెక్టరేట్‌లో పనిచేయడమంటే చాలా గొప్పగా గర్వంగా భావించే వారు. అది గతం... ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రధానంగా ఒకట్రెండు కీలక విభాగాల్లో పనిచేయడానికి ఉద్యోగులు తీవ్ర విముఖత చూపుతున్నారు. ఇంతటి ఒత్తిడితో ఇక్కడ చేయలేమని చెబుతున్నారు. ఉద్యోగులే కాదు విభాగాల అధిపతులుగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ల పరిస్థితి కూడా ఇలానే ఉంది. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సిబ్బందిలో 60 శాతం ఉద్యోగులు తప్పదన్నట్లుగా అయిష్టంగానే విధులు నిర్వర్తిస్తున్నారు. అవకాశం దొరికితే కలెక్టరేట్ నుంచి బదిలీ చేయించుకుని వెళ్లిపోయేందుకు... చివరికి సరిహద్దు మండలాల్లోనైనా పనిచేసేందుకు సిద్ధపడుతున్నారు.

**ఫైళ్లు సిద్ధం చేయడం చేతగాక...**

కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లోని ద్వితీయశ్రేణి అధికారులు, సిబ్బందికి ఫైళ్లు సిద్ధం చేయడం చేతగాకపోవడంతో ఇతరుల (రిటైర్డు రెవెన్యూ ఉద్యోగులు)పై ఆధారపడుతున్నారు. ఫైల్ తయారు చేసినందుకు వారికి కొంత మొత్తం ముట్టచెబుతారు. ఆ డబ్బును సంబంధిత వ్యక్తుల నుంచి వసూలు చేస్తారు. ఇలా ఇద్దరు విశ్రాంత తహసీల్దార్లు, ఇద్దరు విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్లు, ప్రస్తుతం పని చేస్తున్న ఇద్దరు వీఆర్‌ఓలతో ఫైళ్లను సిద్ధం చేస్తారని తెలిసింది. చుక్కల భూములకు సంబంధించి ఫైళ్లను ఒక వీఆర్‌ఓ తయారు చేస్తారని, ఇందుకు రూ.3 వేల వరకు వసూలు చేస్తాడని సమాచారం.

**అవినీతి ఆరోపణలు..**

జిల్లాలోని 31 మండలాల్లో ప్రధానంగా పామిడి, గుమ్మఘట్ట, రాప్తాడు తహసీల్దార్ కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు తీవ్రస్థాయిలో వస్తున్నాయి. డబ్బు ముట్టజెబితేనే పనులు జరుగుతాయన్న విమర్శలున్నాయి. ఈ మండలాల్లో అవినీతి వ్యవహారాలు, అధికారుల తీరుపై కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఇక ప్రజాసమస్యల పరిష్కార వేదికలోనూ ఈ మండలాల అధికారులు, సిబ్బందిపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఇక్కడి అవినీతి ఆరోపణలపై విచారణకు ఆదేశించనున్నట్లు తెలిసింది.

#### అవినీతిని సహించం



రెవెన్యూశాఖలో అవినీతిని సహించేది లేదు. ఆరోపణలు వస్తున్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. కలెక్టరేట్‌లోని ఉద్యోగులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను. ఏ ఫైళ్లు ఎలా ప్రిపేర్ చేయాలని అనే దానిపై రెవెన్యూ ఉద్యోగులకు జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ ద్వారా శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

### నిరుపేద కుటుంబానికి ఆపన్నహస్తం

- వైద్యానికి కలెక్టర్ భరోసా


నారాయణ కుటుంబ సభ్యులు, చిన్నారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంత బాబు

సాక్షి ఎఫెక్ట్..

**కంబదూరు:** నిరుపేద కుటుంబానికి మానవతావాదులు ఆపన్నహస్తం అందించారు. తిమ్మాపురంలో రెండేళ్ల క్రితం తల్లి మరణించగా మూడు రోజుల క్రితం తండ్రి నారాయణ రోడ్డు ప్రమాదానికి గురై ఆయన వైద్యం కోసం చిన్నారులు పడుతున్న వేదనపై శనివారం సాక్షిలో 'మా నాన్నను కాపాడండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా డాక్టర్ వినోద్‌కుమార్ కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబుకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి పరిస్థితిని తెలియజేయాలని ఆదేశించారు. ఆర్డీఓ తహసీల్దార్ బాలకిషన్‌తో కలిసి గ్రామానికి వెళ్లి చిన్నారులను పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వైద్యం ఖర్చుల వివరాలు తెలుసుకుని వైద్యానికయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని కలెక్టర్ చెప్పిన మాటను తెలియజేశారు. అలాగే గ్రామస్తులు సుమారు రూ.2 లక్షల వరకు విరాళాలు సేకరించి నారాయణ వైద్యానికి పంపించారు. మరికొంత మంది మానవతావాదులు రూ. 30 వేలు వరకు ఫోన్ పే ద్వారా పంపించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

## సోషల్‌మీడియా యాక్టివిస్టులపై ఆగని కేసులు


స్టేషన్ నుంచి బయటకు వస్తున్న వాల్మీకి లోకేష్

**హిందూపురం:** సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు ఆగడం లేదు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఫలితాల తర్వాత మాట్లాడుకుందామంటూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు వాల్మీకి లోకేష్ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టాడు. వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేసే వారిని అణచివేసే క్రమంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ నిమిత్తం పోలీసులు శనివారం హిందూపురంలోని దండు రోడ్డులోని ఇంటికి వెళ్లి లోకేష్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, నాగరాజు, నాగమణి శనివారం రాత్రి స్టేషన్‌కు తరలివచ్చి లోకేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టినా ఏనాడూ ఎవరిపైనా కక్షసాధింపులకు దిగలేదని గుర్తు చేశారు. కూటమి పాలనలో భావప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసులు, విచారణ పేరుతో వేధిస్తే సహించేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, నాయకులు వేణురెడ్డి ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామన్నారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో న్యాయవాది వెంకటరెడ్డి పూచికత్తుపై లోకేష్‌ను పోలీసులు వదిలిపెట్టారు.

## యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ జగదీష్

**విడపనకల్లు:** గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. పాల్తూరు గ్రామంలో కడ్లేగౌరమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం పోలీసు మైత్రి సంఘం ఆధ్వర్యంలో ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో యువతకు ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలు ఆయన ప్రారంభించి మాట్లాడారు. మెరుగైన సమాజం యువతతోనే సాధ్యమన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభచాటిన యువతకు ఎస్పీ పతకాలు అందజేశారు. గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్, పాల్తూరు, విడపనకల్లు, బెళుగుప్ప, ఎస్ఐలు మురారి, ఖాజాహుస్సేన్, నాగస్వామి, శివ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

**పామిడి:** ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌పై విజయం సాధించవచ్చన్నారు. అనంతరం స్థానిక నాగిరెడ్డికాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణస్వామి, డెమో సెక్షన్ త్యాగరాజ్ బృందం, ఎద్దులపల్లి ప్రాథమిక వైద్యాధికారి వీ సుధాకర్, సూపర్‌వైజర్లు, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రైవేటు ఆస్పత్రి తనిఖీ..**

స్థానిక ఎద్దులపల్లిరోడ్డులోని ఆరోగ్య ప్రైవేట్ ఆస్పత్రిని శనివారం డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి తనిఖీ చేశారు. ఆస్పత్రి సిబ్బంది నిర్వాకంతో స్థానిక సంతమార్కెట్‌వీధికి చెందిన ఆటోడ్రైవర్ బోయ శివ ఆరోగ్యం దెబ్బతిన్న విషయం తెలిసింది. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ బాధితుడికి అందించిన వైద్యంపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ ఆనంద్‌కుమార్‌కు షోకాజ్ నోటీసు అందజేశారు. విచారించి న్యాయం చేస్తామని ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ బాధితుడికి హామీ ఇచ్చారు.

## భూ మాఫియాను ప్రోత్సహించేలా బిల్లు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

**అనంతపురం అర్బన్:** భూ దురాక్రమణ నిషేధ బిల్లు-2024లోని కొన్ని అధ్యాయాలు పేదలకు అండగా ఉన్న ఉద్యమకారులను అణచివేసి భూ మాఫియాను ప్రోత్సహించేవిగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ బిల్లును పరిశీలిస్తుంటే నగర, పట్టణాలకు, మండ కేంద్రాలకు అనుకుని ఉన్న విలువైన భూములను బడా పెట్టుబడిదారులు, సంపన్నులు, రాజకీయ నాయకులు కట్టబెట్టడానికేనని అర్థమవుతోందన్నారు. ఈ తరహా చట్టం అమలులో ఉన్న గుజరాత్ అనుభవం ఇదే విషయాన్ని రుజువు చేస్తోందన్నారు. ఆక్రమణదారులకు శిక్ష పడేలా, పేదలకు న్యాయం చేకూరేలా భూ దురాక్రమణ నిషేధ బిల్లును సవరించడానికి అఖిలపక్ష సమావేశం వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాగాణి రెండున్నర ఎకరాలు, మెట్ట ఐదు ఎకరాల్లోపు సొంత భూములు కలిగిన పేద, మధ్య తరగతి రైతులు, సొంత ఇల్లు లేని పట్టణ, గ్రామీణ పేదలు, ప్రభుత్వ భూమిని కలిగి ఉన్నవారికి ఈ చట్టం నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

**ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి**

ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల భూములను దౌర్జన్యంగా తీసుకున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ప్రభుత్వస్థలంలో గుడిసెలు వేసుకున్నా, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్నా సొంత ఆస్తిలేని దళితులు, బలహీనవర్గాలకు చెందిన పేదలపై ప్రయోగించే బ్రహ్మాస్త్రంలా ఉందన్నారు. కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్.వి.నాయుడు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణ చేశాకే ఉద్యోగాలు భర్తీ చేయాలి


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

**అనంతపురం టవర్‌క్లాక్:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యాకే ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శనివారం అనంతపురంలోని ఎల్కేపీలో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంద కృష్ణ మాదిగను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా పోరాటం చేసిందని, ఈ పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి త్యాగ ఫలంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతోందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు రాజీవ్‌రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీని తాము స్వాగతిస్తున్నామన్నారు. వీలైనంత త్వరగా కమిటీ నివేదిక ఇచ్చి రెండు నెలల్లోపు వర్గీకరణ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరించిన చంద్రబాబు, నరేంద్ర మోదీ, సుప్రీం కోర్టుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అంతకుముందు మాదిగలు నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

### సత్యసాయి జయంతి వేడుకల ఏర్పాట్లు ప్రారంభం


పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

**పుట్టపర్తి అర్బన్:** సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకల ఏర్పాట్లు శనివారం ప్రారంభమయ్యాయి. రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తి వరకు పారిశుధ్య కార్యక్రమాలను డీ పీఓ సమత, డీఎల్‌పీఓ శివకుమారి ప్రారంభించారు. రెండు రోజుల్లోపు పనులన్నీ పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పనుల్లో నాణ్యత ఉండాలని, అందుబాటులో ఉన్న వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేయడం, డివైడర్ల మధ్య చెత్తాచెదారం తొలగించడం, చెట్లు కత్తిరించడం , విద్యుత్ దీపాలంకరణ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఈఓఆర్డీ ఇందిరబాల, సెక్రటరీలు ఉన్నారు.

### ఆర్‌బీఎస్‌కే బుక్కులు ముట్టుకోవద్దు

**అనంతపురం సెంట్రల్:** చిన్నారుల సంరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమానికి(ఆర్‌బీఎస్‌కే)దూరంగా ఉండాలని అంగన్‌వాడీలు నిర్ణయించారు. తాము జరిపిన చర్చల్లో ప్రాజెక్టు డైరెక్టర్ అంగన్‌వాడీ సిబ్బంది చేయాల్సిన అవసరం లేదని, ఎవరూ ఆర్‌బీఎస్‌కే బుక్కులు ముట్టుకోవద్దు, ఆ పని హెల్త్ డిపార్ట్‌మెంట్‌వాళ్లే చేసుకోవాలంటూ అంగన్‌వాడీల వాట్సాప్ గ్రూపుల్లో యూనియన్ నాయకుల ప్రసంగం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి విద్యార్థికి శిశు ఆరోగ్య ప్రగతి రికార్డు కార్డును అందజేయనున్నారు. ఇందులో ప్రతి నెలకోసారి పిల్లల ఆరోగ్య విషయాలు, ఎత్తు, బరువు తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ అంగన్‌వాడీలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయించడంతో జిల్లాలో ఈ కార్యక్రమం అమలు ప్రశ్నార్థకంగా మారుతోంది.


## సాక్షి సండే క్లాసిఫైడ్స్

**EDUCATION**

**ADMISSIONS**

■ B.Sc. (నర్సింగ్) కి మేనేజ్‌మెంట్ సీట్స్, B.ఫార్మసీ, GNM (నర్సింగ్), B.Sc. (MLT), BPT (ఫిజియోథెరపీ) కి గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్. అర్హత: ఇంటర్ పాస్. సంప్ర: జి.మురళి, 9030661651, అనంతపురము. [A-1410]

**REAL ESTATE**

**బాడుగకు**

■ అనంతపురం సిటీ నందు నేషనల్ పార్క్ శిల్పారామం వద్ద, N.H. హైవే దగ్గర, Skyadobe టవర్స్‌లో B-001, 2BHK ఫ్లాట్ బాడుగకు ఇవ్వబడును. సెల్: 9505555016 [A-367]

**PLOT FOR SALE**

■ ATP బళ్లారి రోడ్డు, లెప్రసీకాలనీ వెనుక 12 సెంట్లు పడమర 30 అ॥ రోడ్డు & బ్రాహ్మనపల్లి స్కందాన్సిలో 10 సెంట్లు, తూర్పు : 60 అ॥ రోడ్డు, దక్షిణం: 40 అ॥ రోడ్డు ప్లాట్లు అమ్మబడును. సెల్: 80085 38019. [A-3562]

■ RTO ఆఫీస్ రోడ్డు భైరవనగర్ 3వ క్రాస్ నందు 5 సెంట్లు గల తూర్పు ఫేస్ ప్లాట్ అమ్మబడును. ఇప్పుడే ఇల్లు కట్టుకోవటానికి అనువైన స్థలం. కాల్ : 79894 30425. [A-540]

**WANTED**

■ Wanted Ent Surgeon, DMOS, OT Technicians ICU Nurses for Sriram Multi Super Speciality Hospital, Ongole. A.P. Contact. ✆ 98495 95190, 98494 12052. [O-793934]

■ ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటీవ్స్ (పు), బైక్ ఉండవలెను. టెలికాలర్ (స్త్రీ) కంప్యూటర్ నాలెడ్జ్ కావలెను. కర్నూలు & నంద్యాల వాస్తవ్యులకు 6305919795 [Y-798490]

■ విష్ణు బిల్డర్స్ అండ్ డెవలపర్స్‌లో పనిచేయడానికి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ మేల్, ఫిమేల్ కావలెను. వివరాలకు సెల్: +919493474334. [A-7424]

■ విష్ణు బిల్డర్స్ అండ్ డెవలపర్స్‌లో పనిచేయడానికి CRO, ఫిమేల్ కావలెను. వివరాలకు సెల్: +918099188888. [A-7425]

■ సెక్యూరిటీగార్డ్ జీ:11,000,ఆఫీస్‌బాయ్,ప్యాకింగ్ హెల్పర్, వెయిటర్‌లిఫ్టింగ్ జీ:10,000,4WO, PF, ESI ఫీల్డ్‌మేనేజర్ ధర్మవరం,గుత్తి,అనంతపురం బజాజ్‌షోరూం లో కావలెను. 9989929852, 9989139239. [T-1235153]

■ HDFC Bank కు Senior Sales Officers కావలెను. Any Degree, Byk, below 30 Yrs, Sal: 22,000-28,000. ✆ 9949942245, 8897909097. [T-2390]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజీలు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801. [M-1185427]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253920]

■ షిరిడి సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14774]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA24000627]

■ పని వారు కావలెను Hyd, బెంగుళూరులో ఉండి ఇంటి, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకి స్త్రీలు కావలెను. 9391912949/ 040 40123376 [SCA24000489]

■ ATP, ఓల్డ్ టౌన్, వాటర్ బాటిల్స్ డెలివరీ బాయ్స్ కావలెను. 3 వీలర్ డ్రైవింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యత. జీతం: 13 వేలు. + ఫుడ్ & అకామిడేషన్. సెల్: 9985480452. [A-762478]

■ సోలార్ కంపెనీలో 2 సంవత్సరాల అనుభవం ఉన్న సేల్స్ ప్రొఫెషనల్స్ కోసం అవకాశాలు; శాలరీ : రూ. 10,000 నుండి రూ. 15,000. ఆసక్తి ఉన్నవారు సంప్ర : 8121766831. [A-1406]

■ అనంతపురం నగరం నందు ప్రముఖ చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవంగల చికెన్ కటింగ్ మాస్టర్ అర్జెంటుగా కావలెను. డైలీ పేమెంట్ ఇవ్వబడును. సెల్: 8639254741. [A-1407]

■ "MY PATTA" ప్రముఖ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ ప్లేస్ మొబైల్ యాప్ ఆఫీస్, KLD రోడ్, ATP నందు కస్టమర్ సపోర్ట్ టెలికాలర్ (Female) కావెలను. జీతం: 12,000/-. సెల్: 9900088636. [A-762477]

■ అనంతపురము, కడప, కర్నూలు జిల్లాల్లో కిసాన్ మిత్ర ప్రోగ్రామ్ నందు ఫీల్డ్ వర్క్ చేయడానికి 10th, ఇంటర్, డిగ్రీ చదివిన స్త్రీ / పురుష అభ్యర్థులు కావలెను. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్: జీతం: 16 వేలు. & డిస్ట్రిక్ట్ మేనేజర్: జీతం: 25 వేలు. 9885417885, 8341890291, 9000501816. [A-762476]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


### బేకరీలు, హోటళ్లపై విజిలెన్స్ దాడులు

**అనంతపురం:** నగరంలోని బేకరీలు, హోటళ్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మికంగా దాడులు చేశారు. స్వగృహ బేకరీ, స్వీట్స్, బెంగళూరు బేకరీ ,ప్యూర్ ఘీ స్వీట్స్, బెంగళూరు బేకరీ, వర్ష హోటళ్లను తనిఖీ చేశారు. వ్యాపార ప్రదేశాల్లో పరిశుభ్రంగా లేకపోవడం, తగిన నాణ్యతా లోపాలను గుర్తించి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం నిర్వహిస్తుండడంతో మున్సిపల్ యాక్ట్ ,1965 చట్ట ప్రకారం రూ.90 వేలు జరిమానా విధించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కే. శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ విజయలక్ష్మి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, శానిటరీ సెక్రెటరీ జి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగి ఆత్మహత్య

**రాప్తాడురూరల్:** బీటెక్ పూర్తయి మూడేళ్లయినా ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురైన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన యోగేంద్ర రెడ్డి శుక్రవారం సాయంత్రం అనంతపురం రూరల్ పరిధిలోని తాటిచెర్ల రైల్వేస్టేషన్ సోములదొడ్డి రైల్వేగేటు మధ్య ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

- నిశ్చితార్థం ముందు రోజు ఘటన


మృతి చెందిన వీణాదేవి

**తాడిపత్రి రూరల్:** నిశ్చితార్థం కోసం గోరింటాకు పెట్టించుకుని సోదరునితో కలిసి ద్విచక్రవాహనంపై వస్తున్న యువతిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరెడ్డిపల్లికి చెందిన వీణాదేవి(24)కి ఆదివారం వివాహ నిశితార్థం జరగాల్సి ఉంది. ఇందు కోసం శనివారం సోదరుడు నారాయణరెడ్డితో కలిసి బైక్‌పై తాడిపత్రికి వెళ్లి చేతికి గోరింటాకు పెట్టించుకుంది. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా వీరి బైక్‌ను బుగ్గ నుంచి తాడిపత్రి వైపు వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో వీణాదేవి అక్కడికక్కడే చనిపోయింది. తీవ్రంగా గాయపడిన తమ్ముడు నారాయణరెడ్డికి తాడిపత్రిలో ప్రథమ చికిత్స చేసి, అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరి కొన్ని గంటల్లో నిశితార్థం జరుగుతుందన్న ఆనందంలో ఉన్న వీణాదేవి ఊహించని విధంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను, గ్రామస్తులను కలచివేసింది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

## చంద్రగిరిలో వ్యక్తిపై హత్యాయత్నం

- పరిస్థితి విషమం


తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తి శెట్టి

**బొమ్మనహాళ్:** మండలంలోని చంద్రగిరి గ్రామంలో శనివారం రాత్రి ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కృష్ణమూర్తి శెట్టి చెల్లెలు పుష్పావతితో కలిసి ఉండేవాడు. రాత్రి ఆయన ఇంట్లో చెల్లెలితో కలిసి భోజనం చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వేటకొడవలితో చెయ్యి, వీపు, తలపై దాడి చేశాడు. తీవ్రగాయాల పాలైన అతడు అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించి చెల్లెలు భయంతో బయటకు వచ్చి కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేలోపు గుర్తు తెలియని వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. కొన ఊపిరితో ఉన్న క్రిష్ణమూర్తి శెట్టిని 108లో బళ్లారి విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న బొమ్మనహాళ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా మండలంలోని కురువల్లికి చెందిన ఓ వ్యక్తితో భూమి తగాదాలతోనే ఈ హత్యాయత్నం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

**హిందూపురం టౌన్:** హిందూపురం పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. పట్టణంలోని మోడల్‌కాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి బైక్‌పై మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని 672 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### కడ్లే గౌరమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న కడ్లే గౌరమ్మ

రాప్తాడు: మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయంలో కడ్లే గౌరమ్మ (గౌరీ దేవి)కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారిని విగ్రహ ప్రతిష్ట చేసి పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఆలయంలో నోముల గౌరీదేవికి ప్రత్యేక పూజలు, గంగ పూజ, చక్కెర హారతులు నిర్వహించారు. రాత్రి యువతులు, మహిళలు ఆలయానికి పోటెత్తారు. సాయంత్రం ఆరు గంటలకు చిన్నారులు చీరకట్టులో గౌరమ్మ బిడ్డలుగా మారి, చక్ర హారతులు (జ్యోతులు) పట్టుకుని కడ్లే గౌరమ్మకు పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా చెక్కభజన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి అమ్మవారిని గ్రామంలో పురవీధుల్లో ఊరేగించి, ఉదయం 9 గంటల ప్రాంతంలో పండమేరు వంకలో నిమజ్జనం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సీఐ టీవీ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

### కనకదాస జయంతిని జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న కురుబ సంఘం నాయకులు

రాప్తాడు: కురుబల ఆరాధ్య దైవం కనకదాస జయంతిని జయప్రదం చేయాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కురుబ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బిల్లే నరేంద్ర ఆధ్వర్యంలో భక్త కనకదాస జయంతి పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 18న అనంతపురంలోని గుత్తి రోడ్డులోని భక్త కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అక్కడి నుంచి కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వశికేరి శివ, నాయకులు పంపు కొండప్ప, ఆకుతోటపల్లి మురళి, చిదగొండ బిరన్న, గోనిపట్ల శీనా తదితరులు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బుక్కరాయసముద్రం, పుట్లూరు, యల్లనూరు,నార్పల, గార్లదిన్నె, అనంతపురం, రాయదుర్గం మండలాల్లో మొక్కజొన్న, అరటి, చామంతి తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. దీంతో పంటసాగుకు రైతులు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అధికారులు పంట నష్టం అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక పంపించి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### కోటి దీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ఆలయ సిబ్బంది, అర్చకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

ఆత్మకూరు: కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోటి దీపోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహస్వామి తెలిపారు. శనివారం గ్రామంలో, ఆలయం వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఏర్పాట్లను ఆర్డీఓ కేశవ నాయుడు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆలయం వద్ద తాగునీరు, మెడికల్ క్యాంపు సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు ఆలయం పక్కన ఉన్న పొలంలో, పాఠశాల ఆవరణలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీడీ సుమన జయంతి, డీఎల్‌బీఓ లలితాబాయి పాల్గొన్నారు.

# అంతా మా ఇష్టం

- నగరపాలక సంస్థ అధికారుల ఇష్టారాజ్యం
- స్టెరిలైజేషన్ పేరుతో రూ.55 లక్షల బిల్లు
- ఇటీవల రూ.14 లక్షలు సమర్పించిన కమిషనర్

| |
|---|
| నగరంలో డివిజన్లు:50 |
| సచివాలయాలు: 74 |
| ఇప్పటి వరకు స్టెరిలైజ్ చేసిన కుక్కల సంఖ్య: 3,690 |
| చెల్లించాల్సిన మొత్తం:రూ. 55.35 లక్షలు |
| ప్రస్తుతం ఏజెన్సీకి ఇచ్చిన డబ్బు: రూ.14 లక్షలు |



నగరంలో సంచరిస్తున్న శునకాలు



కమిషనర్ నాగరాజును ప్రశ్నిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు (ఫైల్)

అనంతపురం కార్పొరేషన్: నగరంలో వివిధ డివిజన్లలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నా వాటికి స్టెరిలైజేషన్ చేసినట్లు రూ.లక్షల్లో బిల్లులు చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. నగరపాలక సంస్థలో అడ్డగోలు బిల్లులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రూ.లక్షల ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారు.

**ఒక్కో శునకానికి రూ.1,500..**

గతేడాది డిసెంబర్‌లో రాజస్థాన్‌కు చెందిన ఓ ఏజెన్సీతో అనంతపురం నగరపాలక సంస్థ అధికారులు ఎంఓయూ చేసుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో శునకాలను పట్టుకుని స్టెరిలైజ్ చేయాలని నిర్ణయించారు. ఒక్కో కుక్కకు స్టెరిలైజ్ చేస్తే రూ.1,500ను నగరపాలక సంస్థ చెల్లించేలా అగ్రిమెంట్ చేశారు. కాగా సదరు ఏజెన్సీ నిర్వాహకులు ఈ ఏడాది జనవరిలో కంపోస్టు యార్డులో పనులు ప్రారంభించగా, అప్పట్లో పాలకవర్గం పర్యటించి స్టెరిలైజేషన్ ప్రక్రియపై తప్పిదాలను లేవనెత్తింది. కానీ సదరు ఏజెన్సీ నిర్వాహకులు ఇప్పటి వరకు 3,690 కుక్కలకు స్టెరిలైజ్ చేసినట్లు నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. అందుకు రూ.55.35 లక్షలు చెల్లించేందుకు రంగం సిద్ధం చేశారు. స్టెరిలైజేషన్ పూర్తి స్థాయిలో చేపట్టలేదని ఈ నెల 12న నగరపాలక సంస్థలో జరిగిన సమావేశంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలు నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజుపై ప్రశ్నల వర్షం కురిపించిన విషయం విదితమే. అసలు డివిజన్‌కు 50 కుక్కలు లేవని, అటువంటిది 3 వేలకు పైగా కుక్కలకు ఎప్పుడు స్టెరిలైజేషన్ చేశారో చెప్పాలని ప్రశ్నించగా.. సమాధానం చెప్పలేక కమిషనర్ నాగరాజు నీళ్లు నమిలారు.

**రూ.14 లక్షల చెక్కు ఇచ్చేశారు..**

మొదటి విడతలో భాగంగా సదరు ఏజెన్సీకి 933 కుక్కలకు స్టెరిలైజేషన్ పేరిట నగరపాలక సంస్థ అధికారులు రూ.14 లక్షల చెక్కును ఇచ్చేశారు. ఇక మిగతా కుక్కల స్టెరిలైజేషన్‌కు సంబంధించి త్వరలో బిల్లు చేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

# ఆర్భాటం.. అంతులేని నిర్లక్ష్యం



రోడ్డుపై పడిన గుంతలు



మట్టి దిబ్బలు మధ్య వెళ్తున్న ద్విచక్ర వాహనాదారులు

రాప్తాడు: రోడ్డుపై గుంతలు పూడ్చటానికి ఆర్భాటంగా మట్టి తోలారు. చదును చేయించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. గత నెల 22న నియోజకవర్గంలో రామగిరి, కనగానపల్లి ఎగువన కురిసిన భారీ వర్షానికి పండమేరు వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో రాప్తాడు నుంచి జేఎన్‌టీయూకు వెళ్లే రహదారి పూర్తిగా బంద్ అయ్యింది. వంకపారినా తర్వాత కూడా పది రోజుల పాటు రోడ్డు మొత్తం బంద్ అయ్యింది. మరోపక్క హంద్రీ- నీవా నీళ్లు పారుతున్నాయి. పండమేరు వంక భారీస్థాయిలో ప్రవహించడంతో వంకపై ఉన్న రోడ్డు మొత్తం పలు చోట్ల గుంతలు పడ్డాయి. జేఎన్‌టీయూ – అనంతపురం వెళ్లే ఈ రోడ్డులో రోజూ వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డు బాగలేకున్నా అలానే ప్రయాణాలు సాగించేవారు. గుంతలను పూడ్చాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గుంతలను పూడ్చాలని ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ స్థానిక సర్పంచు సాకే తిరుపాలును ఆదేశించడంతో ఆయన వారం క్రితం మట్టిని తోలించారు. అయితే చదును చేయకుండా అలానే వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ద్విచక్ర వాహనాదారులు ఈ దారి వెంబడి వెళ్తూ జారీ కింద పడిపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి మట్టిని చదును చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### 18 నుంచి ప్రపంచ వారసత్వ వారోత్సవాలు

అనంతపురం కల్చరల్: రాష్ట్ర పురావస్తు, జిల్లా పర్యాటక శాఖ, 'ఇంటాక్' సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకూ ప్రపంచ వారసత్వ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మ్యూజియం శాఖ సహాయ సంచాలకులు రజిత శనివారం తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు హెరిటేజ్ వాక్ జరుగుతుందన్నారు. స్థానిక కోర్టురోడ్డు పీస్ మెమోరియల్ హాలు వద్ద ప్రారంభమయ్యే హెరిటేజ్ వాక్ టవర్‌క్లాక్ , సప్తగిరి సర్కిల్ మీదుగా జిల్లా పురావస్తు ప్రదర్శన శాల వరకు సాగుతుందన్నారు. అలాగే వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమం చొప్పున చారిత్రక కట్టడాల ప్రాధాన్యత, సంస్కృతిపై అవగాహన కల్పిస్తామన్నారు.

### పప్పూరు రామాచార్యుల స్మారక కమిటీ ఏర్పాటు

అనంతపురం కల్చరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, శ్రీబాగ్ ఒడంబడికలో రాయలసీమకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖుల్లో ఒకరైన పప్పూరు రామాచార్యులు స్మారక కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా హెచ్.నాగలింగయ్య, కోకన్వీనర్లుగా డాక్టర్ నాగేంద్ర, పూజారి ఈరన్నలుగా ఉంటారని కమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, బండి నారాయణ స్వామి, సీనియర్ రచయితలు డాక్టర్ శాంతినారాయణ, టి.రాజారాం, న్యాయవాది లక్ష్మణాచారి, చం.శాస్త్రి, ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి తదితరులు గౌరవ సలహామండలి సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు.

# యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో డీఎస్సీ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ అంబికా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతో డీఎస్సీ నోటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేశారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. నిరుద్యోగులను ఉద్యోగులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

# సమాజ గతిని మార్చే శక్తి బాలికలదే

- అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, అధికారులు

అనంతపురం అర్బన్: సమాజ గతిని మార్చగలిగే శక్తి బాలికలకే ఉందని అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. బాలికల అవసరాలు తీర్చగలిగినప్పుడు, వారి హక్కులు గుర్తించినప్పుడు వారు తమ కుటుంబాన్నే గాక యావత్ సమాజ గతిని మార్చగలరన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అమ్మాయిలను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అమ్మాయిల పెంపకంలో వివక్ష విడనాడాలని సూచించారు. ఆత్మరక్షణ, నైపుణ్య ఉపాధి, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, వ్యక్తిగత రుతుస్రావం- పరిశుభత, నైతిక విలువలతో కూడి విద్య, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్యవివాహాలను అరికట్టడం, మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వంటి అంశాలే లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. శిక్షణ సామాగ్రిని పంపిణీ చేశారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, మెప్మా పీడీ విశ్వజ్యోతి, సీడీపీఓ భారతి, డీసీపీఓ మంజునాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మద్యం పట్టివేత

చెన్నేకొత్తపల్లి: కనగానపల్లి మండలం తూముచర్లలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. చంద్ర అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద అక్రమంగా ఉన్న 47 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఫరూఖాజం తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నాయక్‌తో పాటు సిబ్బంది హరి, రంగనాయకులు పాల్గొన్నారు.

### ట్యాలీ, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అనంతపురం: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరులో 35 రోజులు పాటు ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# దుస్థితి కనరా.. ప్రాణాలు నిలపరా..!

కూటమి ప్రభుత్వంలో 108 వాహనాలు షెడ్డుకే పరిమితమవుతున్నాయి. జిల్లాలో ఉన్న 35 వాహనాల్లో అధిక సంఖ్యలో వాహనాలు రాప్తాడులో ఉన్న షెడ్డుకు చేరుతున్నాయి. స్పేర్ పార్ట్స్, టైర్లు సరిగా లేకపోవడంతో వాహనాలను ఇక్కడికి తీసుకువచ్చేస్తున్నారు. దీంతో అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. తాజాగా శనివారం 108 వాహనం టైర్ పంచర్ కాగా.. అందులో ఉన్న శిశువుకు సకాలంలో వైద్యం అందక మృతి చెందిన ఘటన శ్రీసత్యసాయి జిల్లా ఎన్ఎస్ గేట్ సమీపంలో చోటు చేసుకుంది. మరిన్ని మరణాలు చోటుచేసుకోకముందే ప్రభుత్వం కళ్లు తెరవాల్సి ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



రాప్తాడు వద్ద షెడ్డులో నిలిపిన 108 వాహనాలు



మరమ్మతులు చేస్తున్న దృశ్యం



మరమ్మతులకు గురై నిలిచిన 104 వాహనం



108ల దుస్థితి..

# సమస్యల వలయంలో చిన్నంపల్లి

- ఎక్కడ చూసినా బురద
- అధ్వానంగా ఎస్సీ కాలనీ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో అల్లుకుపోయిన కంపచెట్లు



పంచాయతీ కార్యాలయం ఎదుట నిలిచి వర్షపునీరు



అనంతపురం రూరల్: జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న చిన్నంపల్లి పంచాయతీలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపిస్తోంది. చిన్న పాటి వర్షానికే దారులన్నీ బురదమయమవుతున్నాయి. వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు రావడం.. పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పి ఓట్లు వేయించుకోవడం, అధికారంలోకి రాగానే విస్మరించడం పరిపాటిగా మారింది.

**పట్టని అధికారులు..**

చిన్నంపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్లు కంప చెట్లతో అల్లుకుపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే మనుషులు కూడా కనపడని దుస్థితిలో రోడ్లు ఉన్నాయి. పంచాయతీ కార్యాలయం, పాఠశాల ముందు మోకాల్లోతు గుంతలు ఏర్పడటంతో చిన్నపాటి వర్షానికే నీరు రోజుల తరబడి నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గ్రామం నుంచి అనంతపురం నగరంలోని స్కూళ్లకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి ఘోరంగా తయారైంది. అడుగు తీసి అడుగు వేయాలంటే ఆచితూచి నడవాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీ కార్యాలయం ఎదుటే సమస్యలు తాండవిస్తున్నా అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

### ఆక్రమణల తొలగింపు



అంబేడ్కర్ నగర్‌లో పర్యటించిన కమిషనర్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో దళిత వాడలపై నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలో రాజు రోడ్డు, సుభాష్ రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, రాంనగర్, సాయి నగర్, విద్యుత్ నగర్, తదితర కమర్షియల్ ప్రాంతాల్లో కాలువలపై నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నారు. వర్షం వస్తే మురుగు బ్లాక్ అయ్యి కంపు కొడుతున్న దృశ్యాలు నిత్యం చూస్తున్నాం. అలాంటి చోట్లను వదిలేసి నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు పర్యవేక్షణలో శనివారం నగరంలోని అంబేడ్కర్ నగర్‌లో కాలువలపై ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. నగరంలో సమస్యాత్మక ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటే బాగుంటుందని నగర వాసులంటున్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'కొన్ని చీకట్లూ.. ఓ వెలుతురూ' పుస్తక పరిచయం

అనంతపురం కల్చరల్: సీనియర్ రచయిత్రి ప్రగతి రచించిన కథల సంపుటి 'కొన్ని చీకట్లూ..ఓ వెలుతురూ' పుస్తక పరిచయ సభ ఆదివారం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు డాక్టర్ పల్లవి, డాక్టర్ అంకె శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగే పుస్తక పరిచయ కార్యక్రమానికి సాహితీవేత్తలు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని, సాహితీ అభిమానుందరూ పాల్గొనాలని కోరారు.

### 'ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాన్ని విలీనం చేయాలి'

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాన్ని ఇతర విభాగంలోకి విలీనం చేయాలని ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన డిమాండ్ చేశారు. క్యాంపస్‌లో ఈ మేరకు శనివారం ఆందోళన చేశారు. ఎమ్మెస్సీ ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సులో విద్యార్థుల అడ్మిషన్లు తీసుకోలేదన్నారు. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఇందులో పనిచేస్తున్న ప్రొఫెసర్లకు, టీచింగ్ అసిస్టెంట్‌లకు మాత్రం జీతాలు చెల్లిస్తూ వర్సిటీ సొమ్మును వృథా చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాన్ని ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్ విభాగాల్లో విలీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, కృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయ ఉద్యమకారుల సేవలు చిరస్మరణీయం

కనగానపల్లి: గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్.ఆర్.రంగనాథన్, వెంకటరమణయ్య, హరిసర్వోత్తమరావు సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. శనివారం కనగానపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయాల ఆవశ్యకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

రామగిరి: ప్రజలను విజ్ఞానవంతులను, చైతన్యవంతులను చేసేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి వెంకటేష్ పేర్కొన్నారు. రామగిరిలో శనివారం 57వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు.

### రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

ఆత్మకూరు: విద్యార్థుల కోసం ఈ నెల 18 నుంచి మండల వ్యాప్తంగా ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత తేదీల్లో ఆయా పాఠశాలలు, కళాశాల విద్యార్థుల అపార్‌కు అవసరమైన ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

### 'లోకాయుక్తను తరలించొద్దు'

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త కార్యాలయాలను అమరావతికి తరలించవద్దని అనంతపురం అర్బన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దాదా గాంధీ శనివారం ఒక ప్రకటనలో కోరారు. వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్ర విభజన తరువాత అన్ని ప్రాంతాలు వెనుకబడిపోయాయని, రాయలసీమ పరిస్థితి చాలా దారుణంగా మారిందన్నారు.

**CHANGE OF NAME**

I, SYED INAYATHULLA (Aadhaar No: 5964 6340 1604) S/o SYED ALLA BAKASH, wife Name SYED MEHATAJ, Residing at D.No. 13-1-503, M.G Colony, Anantapur City & Dist. A.P. Pass Port No: C1312974, Wife Pass Port No. F2067792, I need correction of my name in my Pass Port from SYED ENAYATHULLAH S/o SYED ALLA BAKASH, Wife Name SYED MEHATHAJ BEGUM (Old Name) to SYED INAYATHULLA S/o SYED ALLA BAKASH, Wife Name SYED MEHATAJ (New Name) for all purpose. Affidavit M. ZUBAIR, Advocate & Notary, Anantapur.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనంతపురము డివిజన్
9912220732, 9912220719, 9912220724
9010223702, 9010567770, 9010588846